సాక్షి నిజామాబాద్

బుధవారం, 26, జూన్, 2024



సాకారమైన కల

స్కూల్ అసిస్టెంట్లుగా, పీడీలుగా తమకు పదోన్నతులు కల్పించడంతో భాషా పండితులు, పీఈటీలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- 8లో ▸



లారీని ఢీకొన్న బస్సు

ఆగి ఉన్న లారీని ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొన్న ఘటనలో ఒకరు మరణించారు. మరో 28 మందికి గాయాలయ్యాయి.

- 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం 36.6 /26.8

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. వాతావరణంలో తేమ అధికంగా ఉంటుంది. అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

ఎంపీగా అర్వింద్ ప్రమాణస్వీకారం



సుభాష్‌నగర్: నిజామాబాద్ పార్లమెంట్ సభ్యుడిగా ధర్మపురి అర్వింద్ మంగళవారం పార్లమెంట్‌లో ప్రమాణస్వీకారం చేశారు. ఆయన ఎంపీగా రెండోసారి గెలుపొందిన విషయం తెలిసిందే. ధర్మపురి అర్వింద్ ఆంగ్లంలో ప్రమాణస్వీకారం చేశారు.

స్కూళ్లు, కాలేజీలపై దాడులకు పాల్పడితే చర్యలు

- సీపీ కల్మేశ్వర్

ఖలీల్‌వాడి: జిల్లాలోని పలు విద్యార్థి సంఘాలు కొన్ని ప్రైవేటు పాఠశాలలు, ప్రైవేటు కాలేజీల క్యాంపస్‌లలోకి ప్రవేశించి యాజమాన్యాలతో గొడవకు దిగి, భయభ్రాంతులకు గురిచేస్తే చర్యలు తప్పవని సీపీ కల్మేశ్వర్ హెచ్చరించారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. విద్యార్థి నాయకులు విద్యాసంస్థలకు సంబంధించి సమస్యలు ఉన్నట్లయితే జిల్లా విద్యాశాఖ అధికారులు, జిల్లా పరిపాలన అధికారి దృష్టికి తీసుకువెళ్లాలన్నారు. విద్యార్థుల సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలని సూచించారు. అంతేకాని విద్యార్థి సంఘాల నాయకులు స్కూళ్లకు, కాలేజీలకు వెళ్లి దాడులు చేసినా, బంద్ చేయించినా, యాజమాన్యాలను భయభ్రాంతులకు గురిచేసినా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ మేరకు జిల్లాలోని ఏసీపీలు, సీఐలు, ఎస్సైలకు ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు.

కాంగ్రెస్ అగ్రనేతలను కలిసిన పోచారం భాస్కర్‌రెడ్డి



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: ఉమ్మడి నిజామాబాద్ జిల్లా మాజీ డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి మంగళవారం ఢిల్లీలో ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ, తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షిలను మర్యాదపూర్వకంగా కలిశారు.

ముగిసిన పాలిసెట్ కౌన్సెలింగ్


నిజామాబాద్‌అర్బన్: పాలిటెక్నిక్‌లో ప్రవేశానికి సంబంధించి మొదటి విడత పాలిసెట్ కౌన్సెలింగ్ మంగళవారం ముగిసింది. చివరిరోజు 250 మంది విద్యార్థులు కౌన్సెలింగ్‌లో పాల్గొన్నారు. ధ్రువపత్రాల పరిశీలన పూర్తయిన వారు ఈనెల 27లోపు వెబ్‌ఆప్షన్లు నమోదు చేసుకోవాలని అధికారులు సూచించారు. సీటు పొందిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో జాయినింగ్ రిపోర్టు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ఈనెల 30లోపు సీట్ల కేటాయింపు ఉంటుందని పేర్కొన్నారు.

రైతు భరోసాపై సలహాలు తీసుకోవాలి



ఎడపల్లి(బోధన్): రైతు భరోసాపై సలహాలు, సూచనలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు బజార్‌లో మంత్రి నాగేశ్వరరావుతో జిల్లా వ్యవసాయ అధికారి వాజిద్ హుస్సేన్ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్‌లో మండల రైతులు ఆకుల శ్రీనివాస్, మల్కారెడ్డి, కామప్పలు మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో మాట్లాడారు. రైతుల సలహాలు, సూచనలు తీసుకోవడం చాలా మంచి పరిణామని సంతోషం వ్యక్తం చేశారు. జిల్లా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ.. జిల్లా మొత్తంలో డిచ్‌పల్లి మండలం మెంట్రాజ్‌పల్లి, ఆర్మూర్, మునిపల్లి, ఎడపల్లి మండల పరిధిలోని రైతు వేదికలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆయన తెలిపారు. బోధన్, కోటగిరి, రెంజల్, నవీపేట, ఎడపల్లి మండలాల వ్యవసాయ శాఖాధికారులు, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

గతుకుల రోడ్డుపై బతుకు బండి



వందల సంఖ్యలో బస్సులు.. లక్షల మంది ప్రయాణికులు.. వారిని సకాలంలో క్షేమంగా గమ్యస్థానాలకు చేర్చేందుకు ఆర్టీసీ ఉద్యోగులు అహర్నిశలు శ్రమిస్తున్నారు. పగలు రాత్రి తేడా లేకుండా పనిలో నిమగ్నమవుతున్నారు. పని భారాన్ని భరిస్తూ ఆర్టీసీ అర్థికాభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారు. ఇటీవల ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'మహాలక్ష్మి' పథకంతో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించేవారి సంఖ్య విపరీతంగా పెరిగింది. దీంతో ఉద్యోగులపై తీవ్ర పనిఒత్తిడి పడింది. వీటన్నింటినీ తట్టుకుని నిబద్ధతతో విధులు నిర్వహిస్తున్నా.. వారి బతుకు బండి సురక్షితంగా సాగడంలేదు. ఒకవైపు తీవ్ర పనిఒత్తిడి, డబుల్ డ్యూటీలు.. మరోవైపు అనారోగ్య సమస్యలు, అధికారుల వేధింపులు, ఇలా అనేక సమస్యలతో ఆర్టీసీ ఉద్యోగులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలోని ఆర్టీసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రత్యేక కథనం..

ఆర్టీసీ ఉద్యోగులపై తీవ్ర పనిఒత్తిడి

- నిత్యం 350 కిలో మీటర్లకు పైగా డ్యూటీ
- కేఎంపీఎల్ రాకపోతే డ్రైవర్లకు కౌన్సెలింగ్
- 'మహాలక్ష్మి'తో కిటకిటలాడుతున్న బస్సులు
- ఇబ్బందులు పడుతున్న డ్రైవర్లు, కండక్టర్లు

ఖలీల్‌వాడి: ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో నిజామాబాద్–1, నిజామాబాద్–2, ఆర్మూర్, బోధన్, కామారెడ్డి, బాన్సువాడ డిపోలు ఉన్నాయి. వీటి పరిధిలో 2400కు పైగా మంది ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. గతంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిత్యం లక్షా 90వేల మంది ప్రయాణించేవారు. కాగా.. మహాలక్ష్మి పథకం ప్రవేశ పెట్టిన అనంతరం ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే వారి సంఖ్య రెండు లక్షల 90 వేలకు చేరింది. పల్లె వెలుగు బస్సుల్లో ప్రయాణికుల సామర్థ్యం 50 మంది వరకు ఉంటుంది. గతంలో సామర్థ్యానికి మించి అదనంగా 10 నుంచి 20 మంది వరకు ప్రయాణం చేసేవారు. ప్రస్తుతం పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్‌లలో 80 నుంచి 100 మంది వరకు ప్రయాణం చేస్తున్నారు. ఏ బస్సు చూసినా ప్రయాణికులతో కిక్కిరిసిపోతున్నాయి. దీంతో బస్సుల్లో ప్రయాణించడానికి వయస్సు పైబడినవారు, చిన్న పిల్లలు అవస్థలు పడుతున్నారు.

8 గంటల డ్యూటీ లేదు..

డ్రైవర్లు, కండక్టర్లకు గతంలో 8 గంటల డ్యూటీ ఉండేది. కానీ ఇప్పుడు పని గంటల నిబంధన లేదు. సుదూర ప్రాంతాలకు వెళ్లిన డ్రైవర్లు, కండక్టర్లు డేడ్యూటీ చేస్తారు. కానీ ఉదయం వెళ్లిన వారు అక్కడ ట్రాఫిక్ ఇబ్బందులతో తిరిగి వచ్చే సరికి రాత్రి అవుతోంది. నిజామాబాద్ – హైదరాబాద్ మధ్య అప్ అండ్ డౌన్ 360 కిలోమీటర్లు అవుతుండగా.. నిజామాబాద్ – వరంగల్ మధ్య అప్ అండ్ డౌన్ 460 కిలోమీటర్లు పడుతుంది. దీంతో పాటు వారికి టార్గెట్ ఒత్తిడి కూడా ఉంటుంది. దీంతో కార్మికులకు పనిభారం పెరుగుతోంది. ఇలా డ్రైవర్లు, కండక్టర్లు నిత్యం 10 నుంచి 12 గంటల పాటు పని చేస్తున్నారు. దీంతో నిద్ర కరువై అనారోగ్యాల భారిన పడుతున్నారు. నిద్రలేమి కారణంగా కొన్ని సందర్భాల్లో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. యూనియన్లు లేకపోవడంతో డిపోలోని అధికారులు సిబ్బందికి ఇష్టారాజ్యంగా డ్యూటీలు వేయడంతో పనిఒత్తిడి పెరుగుతోంది.

ప్రశ్నిస్తున్న అధికారులు

ఆర్టీసీ బస్సులకు డ్రైవర్లు కేఎంపీఎల్ తీసుకురాకపోతే కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. రూట్‌లో వెళ్లే బస్సులు కేఎంపీఎల్ ఎందుకు రాలేదని ప్రశ్నిస్తున్నారు. డ్రైవర్లకు కౌన్సిలింగ్ ఇచ్చి కేఎంపీఎల్ వచ్చేటట్లు చూడాలని సూచనలు చేస్తున్నారు. కండక్టర్లకు మహాలక్ష్మి పథకంతో పాటు టిక్కెట్లకు టార్గెట్ నిర్దేశిస్తున్నట్లు ఆర్టీసీలో చర్చ జరుగుతోంది. దీంతో టార్గెట్ కాకపోతే తాము ఏం చేయగలమని కండక్టర్లు వాపోతున్నారు.



నిజామాబాద్ బస్టాండ్‌లో ప్రయాణికుల కిటకిట

రోజంతా పని చేస్తేనే స్పెషల్ ఆఫ్

ఆర్టీసీ ఉద్యోగులు లీవ్‌లు తీసుకోవాలంటే కూడా ఇబ్బందులు తప్పడం లేదు. కండక్టర్, డ్రైవర్లకు డే డ్యూటీ, నైట్ డ్యూటీ, స్పెషల్ డ్యూటీ ఉంటుంది. రోజంతా పనిచేస్తేనే మరుసటి రోజు స్పెషల్ ఆఫ్ ఇస్తున్నారు. అలాగే అనార్యోగం పాలైన సిబ్బంది సంబంధిత డాక్టర్ల నుంచి మెడికల్ సర్టిఫికెట్ తీసుకురావాల్సి ఉంటుంది. ఇతర సెలవులు కావాలంటే అధికారుల అనుమతి తప్పకుండా తీసుకోవాల్సిందే.

సామర్థ్యానికి మించి ప్రయాణం..

మహాలక్ష్మి పథకం కారణంగా బస్సుల్లో విపరీతమైన రద్దీ పెరిగింది. దీంతో సామర్థ్యానికి మించి అత్యధిక మంది ప్రయాణికులతో నడుస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో ఎక్కువగా పదేళ్లకు పైబడిన బస్సులు ఉండడంతో ఓవర్‌లోడ్ కారణంగా మధ్యలో ఆగిపోయిన సందర్భాలున్నాయి. బస్సులో రద్దీ కారణంగా టికెట్లు జారీ చేసేందుకు నిలిపితే బస్సు ఆలస్యంపై ఫిర్యాదులు చేసిన సందర్భాలు కూడా ఉన్నాయి. బస్సులో అధికంగా ప్రజలు ఉండడం, ఫుట్‌బోర్డుపై కూడా నిలబడుతుండడంతో డ్రైవర్లు బస్సులను నడపడంలో ఇబ్బందులు పడుతున్నారు. బస్సు పక్కన ఉన్న అద్దాలను చూడడానికి కూడా వీలులేకుండా ప్రయాణికులు ఉంటున్నారు. దీంతో అనుకోకుండా ఏదైనా ప్రమాదం జరిగితే తమను సస్పెండ్ చేస్తారని డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే కేఎంపీఎల్ రాకపోవడంతో అధికారులు ప్రశ్నిస్తున్నారని.. దీంతో తాము సమాధానం చెప్పుకోవాల్సి వస్తోందని డ్రైవర్లు వాపోతున్నారు.

అనారోగ్య సమస్యలు

తీవ్ర పని ఒత్తిడి కారణంగా ఆర్టీసీ ఉద్యోగులు అనారోగ్యం బారిన పడుతున్నారు. విధి నిర్వహణలో పనిభారం అధికమవడంతో రక్తపోటు, మధుమేహం, కంటి, హృద్రోగ తదితర సమ స్యలతో ఇబ్బందులు పడుతున్నారు. విశ్రాంతి లేకుండా విధుల్లో పాల్గొనడంతో ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. తమపై పనిభారం తగ్గించాలని ఉద్యోగులు కోరుతున్నారు.

ఉమ్మడి జిల్లాలోని డిపోలు, బస్సుల వివరాలు

బస్సు డిపోలు	6
బస్సు రూట్లు	240
బస్సుల సంఖ్య	575
ఆర్టీసీ బస్సులు	410
హైర్ బస్సులు	165
రోజు ఆక్యుపెన్సీ	95
కొత్త బస్సుల ప్రతిపాదనలు	25
కొత్తగా వచ్చిన బస్సులు	18



మహాలక్ష్మి పథకం ప్రారంభించడంతో..

ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం కారణంగా ఆర్టీసీ బస్సుల్లో తీవ్రంగా రద్దీ పెరిగింది. ఏ బస్సులో చూసినా మహిళలే ఎక్కువగా ప్రయాణిస్తున్నారు. సీట్ల కోసం మాటల యుద్ధాలు జరుగుతున్నాయి. కొన్ని సందర్భాల్లో గొడవలు సైతం జరుగుతున్నాయి. అలాగే టిక్కెట్ కొనుగోలు చేస్తున్న పురుషులు కూర్చునేందుకు సీట్లు దొరకడం లేదు. దీనివల్ల కూడా వాగ్వాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ పరిస్థితులు ఆర్టీసీ కండర్లు, డ్రైవర్లకు తలనొప్పిగా మారుతున్నాయి. బస్సులో ఎక్కువ సంఖ్యలో ప్రయాణికులు ఉంటుండడంతో బస్సు ఆలస్యం కావడంతో పాటు కేఎంపీఎల్ కూడా రావడం లేదు. దీంతో డ్రైవర్లు అధికారులకు సమాధానం చెప్పుకోవాల్సి వస్తోంది. అలాగే విపరీతమైన రద్దీ కారణంగా కండక్టర్లు సైతం టికెట్లు ఇచ్చే సమయంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ప్రయాణం కష్టంగా మారింది



బస్సులలో ప్రయాణం చేయడం కష్టంగా ఉంది. బస్సులలో ఎక్కువ మంది మహిళలే వస్తున్నారు. దీంతో కుర్చోవడానికి సీట్లు లేవు. ప్రత్యామ్నయంగా కొత్త బస్సులు ఏర్పాటు చేయాలి. కొంత మంది బస్సు మెట్ల మీద కుర్చుండాల్సి పరిస్థితి వస్తుంది.

– సునీత, ప్రయాణికురాలు, నిజామాబాద్

పురుషులకు సీట్లు కేటాయించాలి



బస్సుల్లో మహిళలు సీట్లలో కూర్చోవడంతో పురుషులకు సీట్లు కేటాయించాలి. లేకపోతే గమ్యస్థానికి వెళ్లడానికి నానా అవస్థలు పడాల్సి వస్తోంది. కనీసం నిలబడడం కూడా కష్టంగా మారింది. కూర్చునేందుకు సీట్లు లేక పెద్దలు, పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు.

– చిరంజీవి, ప్రయాణికుడు, నిజామాబాద్

పీఆర్‌టీయూలో ముసలం

- తిరగబడుతున్న ఎస్జీటీలు
- 11 మండలాల బాధ్యుల రాజీనామా
- పదోన్నతులు దక్కకపోవడమే ప్రధాన కారణం
- పీఆర్‌టీయూ నాయకత్వం పట్టించుకోవడంలేదని ఆరోపణలు
- ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎస్జీటీలకు ఓటు హక్కు లేకపోవడమే కారణమా..



ధర్పల్లిలో పీఆర్‌టీయూ సభ్యత్వానికి రాజీనామా చేసి నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్జీటీలు

నిజామాబాద్‌అర్బన్: జిల్లా విద్యాశాఖలో పదోన్నతుల వ్యవహారం ప్రధాన సంఘానికి సంకటంగా మారింది. ఇటీవల జరిగిన పదోన్నతుల ప్రక్రియలో తమకు తీవ్ర అన్యాయం జరిగిందని ఎస్జీటీలు ఆరోపిస్తున్నారు. ఈ విషయంలో విద్యాశాఖలో ప్రధాన సంఘమైన పీఆర్‌టీయూ ఏమాత్రం స్పందించక పోవడం సరైంది కాదంటూ ఏకంగా 11 మండలాల బాధ్యులు ఆ సంఘానికి రాజీనామా చేశారు. దీంతో పీఆర్‌టీయూలో ముసలం పుట్టింది. క్రమక్రమంగా పీఆర్‌టీయూలో ఉన్న ఎస్జీటీ ఉపాధ్యాయులు అందరూ రాజీనామాలు చేస్తూ తప్పుకుంటున్నారు. వచ్చే నెలలో సంస్థాగత ఎన్నికలు ఉండగా, మరోవైపు యూనియన్ జిల్లా బాధ్యులు కూడా స్పందించక పోవడంపై సమస్య తీవ్ర రూపం దాల్చే అవకాశం ఉంది.

అసలు ఏం జరిగిందంటే...

జిల్లా విద్యాశాఖలో ఇటీవల పదోన్నతుల ప్రక్రియ నేపథ్యంలో భాషా పండితులు, పీఈటీలను అప్‌గ్రేడ్ చేశారు. జిల్లాలో 460 మందికి పదోన్నతులు లభించాయి. 2019లో జీవో నెంబర్ 02 ప్రకారం అందరికీ సమానమైన పదోన్నతులు కల్పించాలని నాటి ప్రభుత్వం జీవోలో పేర్కొంది. అనంతరం 2015లో టీఆర్ఎస్ ప్రభుత్వం జీవో నెంబర్ 1,2 తీసుకువచ్చి ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న భాషా పండితులు పీఈటీలకు పదోన్నతులు కల్పించాలంటూ మరో జీవో తీసుకువచ్చారు. ఈ వ్యవహారం దుమారం రేపింది.అనంతరం కొన్ని సంవత్సరాల పాటు పదోన్నతులు బదిలీలు లేక ఆగిపోయింది. మళ్లీ భాషా పండితులు, పీఈటీలు టీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో ప్రకారం తమకు పదోన్నతులు కల్పించాలంటూ హై కోర్టులో కేసు వేశారు. కోర్టులో సైతం వీరికి అనుకూలంగా తీర్పు వచ్చింది.

దీంతో ఎస్జీటీలకు రావాల్సిన పదోన్నతులు భాషా పండితులు, పీఈటీలకు వెళ్లాయి. జిల్లాలో ఇటీవల జరిగిన పదోన్నతులలో 460 మంది భాషా పండితులు పదోన్నతి పొందారు. అలాగే గతంలో ప్రభుత్వం ప్రాథమిక హైస్కూల్ కు సంబంధించిన పదివేల హెచ్ఎం పోస్టులను మంజూరు చేస్తామని చెప్పింది. ఈ పోస్టులు అమలులోకి వస్తే ఎస్జీటీలకు పదోన్నతి లభించే అవకాశం ఉంది. ఇది కూడా అమలు కాలేదు. అదేవిధంగా ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంల పదోన్నతి ఎస్జీటీ చేసిన వారికి ఇవ్వాలని నిబంధన ఉన్నా బీఈడీ చేసిన వారికి సైతం ఇచ్చారు. దీని వల్ల ఎస్జీటీలు నష్టపోయారు. ఆన్‌లైన్‌లో బదిలీలకు సంబంధించి వెబ్ ఆప్షన్ల వ్యవహారం కొనసాగింది. దీంట్లో ఒక్కో ఉపాధ్యాయుడు బదిలీలకు సంబంధించి 1200 ఆప్షన్లను నమోదు చేయవలసి ఉంటుంది. ఇది చాలా కష్టతరంగా ఉందని దీని రద్దు చేయించాలని పీఆర్‌టీయూ నాయకులను కోరగా వారు స్పందించలేదు. ఈ కారణాల వల్ల గత కొన్ని రోజులుగా జిల్లాలో పీఆర్‌టీయూకు సంబంధించి మండల అధ్యక్షులు, కార్యదర్శులు ఇతర కార్యవర్గ సభ్యులు రాజీనామాలు చేస్తున్నారు. జిల్లాలో 11 మండలాలకు సంబంధించి అధ్యక్ష, కార్యదర్శులతో పాటు ఇతర బాధ్యులు రాజీనామాలు చేశారు. కొన్ని మండలాల్లో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి పీఆర్‌టీయూ నాయకుల సమావేశాలకు వెళ్లకూడదని నిర్ణయించారు. బాల్కొండ, ధర్పల్లి, జక్రాన్‌పల్లి మండలాల్లో ఎస్జీటీలు పీఆర్‌టీయూకు వ్యతిరేకంగా ధర్నాలు చేశారు. జిల్లా నాయకులు సైతం అందుబాటులో లేకుండా పోయారు. దీంతో ఎస్జీటీలు తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారు.

అంతా ఎన్నికల కోసమేనా...

వచ్చే సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్నాయి. దీనిని దృష్టిలో పెట్టుకొని ఓటు హక్కు లేని ఎస్జీటీలకు పదోన్నతి రాకుండా కొందరు ఉన్నతాధికారులతో పాటు పీఆర్‌టీయూ సంఘం నాయకులు అడ్డుపడ్డారని ఆరోపణలు ఉన్నాయి. భాషా పండితులు, పీఈటీలు పీజీహెచ్ఎంలు, స్కూల్ అసిస్టెంట్లకు సంబంధించి ఓటు హక్కు ఉన్నవారికి ప్రాధాన్యత ఇచ్చారని అంటున్నారు. ఓటు హక్కు లేదనే కారణంతో ఎస్జీటీలకు నిబంధనల ప్రకారం రావాల్సిన పదోన్నతులను రాకుండా చేశారని ఎస్జీటీ టీచర్లు ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలోనే ఎస్జీటీలు పీఆర్‌టీయూకు రాజీనామాలు చేస్తూ నిరసన వ్యక్తం చేస్తున్నారు. కాగా వచ్చే నెలలో పీఆర్‌టీయూ సంఘానికి జిల్లా ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. ఓవైపు మండలాల వారీగా అందరూ రాజీనామాలు చేస్తుండగా జిల్లా ఎన్నికల నిర్వహణ కష్టతరంగా మారనుంది. జిల్లాలో 2800 మంది ఎస్జీటీలు ఉండగా ఇందులో 2457 మంది పీఆర్‌టీయూ సభ్యత్వం కలిగి ఉన్నారు. ఇప్పటికే సగం మంది పీఆర్‌టీయూకు రాజీనామాలు చేస్తూ నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఎస్జీటీల సమస్యలను విన్నవించి పరిష్కరించడంలో జిల్లా అధ్యక్షుడు ఏమాత్రం స్పందించలేదని, కనీసం పట్టించుకోలేదని ఆరోపణలు ఉన్నాయి. యూనియన్‌కు మొదట మండలాల్లో ఎన్నికలు నిర్వహించి అనంతరం జిల్లా సంఘానికి ఎన్నిక నిర్వహిస్తారు. అధిక సంఖ్యలో ఉండే ఎస్జీటీలు పీఆర్‌టీయూ సంఘానికి దూరం కావడంతో సంఘం నాయకులు అయోమయంలో పడుతున్నారు.


తీవ్ర అన్యాయం జరిగింది



నిబంధనల ప్రకారం మాకు రావాల్సిన పదోన్నతులు రాలేదు, ఎస్జీటీలకు తీవ్ర అన్యాయం జరిగింది. పీఎస్ హెచ్ఎం పోస్టులు మంజూరు చేస్తామని చెయ్యలేదు. అందరికీ సమానమైన రిక్రూట్‌మెంట్ ఉన్న పదోన్నతుల్లో తేడ ఎందుకు తీసుకువచ్చారో చెప్పాలి. మాకు ప్రధాన సంఘం కూడ సహకరించడం లేదు.

–వెంకటరాజరెడ్డి, ఎస్జీటీ, ధర్పల్లి

ఓటుహక్కు లేదనే చిన్న చూపు



ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కులేదనే ఎస్జీటీలకు పదోన్నతులు కల్పించలేదు . పీఆర్‌టీయూ సంఘం కూడ మాకు సపోర్టు చెయ్యలేదు. మాకు నిబంధనల ప్రకారం పదోన్నతులు కల్పించాలి. లేదంటే నిరసనలు చేస్తాం.

-సతీశ్, ఎస్జీటీ

కమాండెంట్‌గా రోహిణి ప్రియదర్శిని బాధ్యతల స్వీకరణ



రోహిణి ప్రియదర్శినికి స్వాగతం పలుకుతున్న బదిలీ అయిన కమాండెంట్ రాంప్రకాశ్

డిచ్‌పల్లి: తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక పోలీస్ ఏడో బెటాలియన్, డిచ్‌పల్లి నూతన కమాండెంట్‌గా రోహిణి ప్రియదర్శి(ఐపీఎస్) మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు కమాండెంట్‌గా పని చేసిన బి.రాంప్రకాష్ నూతన కమాండెంట్ రోహిణి ప్రియదర్శినికి మొక్కను అందజేసి స్వాగతం పలికారు. అనంతరం ఆమెకు బాధ్యతలు అప్పగించారు. బాధ్యతలు స్వీకరించిన తర్వాత నూతన కమాండెంట్ బెటాలియన్ సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బెటాలియన్ అభివృద్ధికి, సంక్షేమ కార్యక్రమాల అమలుకు కృషి చేస్తానని తెలిపారు. అసిస్టెంట్ కమాండెంట్స్ కేపీ శరత్ కుమార్, కేపీ సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు పాఠశాలల బంద్

నిజామాబాద్‌అర్బన్: నేడు పాఠశాలల బంద్‌కు ఏబీవీపీ పిలుపునిచ్చింది. ప్రయివేట్ పాఠశాలల్లో అక్రమంగా వసూలు చేస్తున్న ఫీజులను నియంత్రణ చేపట్టాలని, నిబంధనల ప్రకారం లేని ప్రయివేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ బడుల్లో సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ బంద్‌కు పిలుపునిచ్చింది. ఈక్రమంలో జిల్లాలోని అన్ని పాఠశాలలు బుధవారం బంద్ పాటించాలని ఏబీవీపీ నాయకులు పేర్కొన్నారు.

క్లుప్తంగా

రీవాల్యుయేషన్‌కు దరఖాస్తుల ఆహ్వానం

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని పీజీ 1, 3, 5వ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షల రీవాల్యుయేషన్ కోసం విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని కంట్రోలర్ అరుణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒక్కో పేపర్ రీవాల్యుయేషన్‌కు రూ.500 చొప్పున చెల్లించాల్సి ఉంటుందని, జూలై 1వ తేదీలోగా ఆసక్తిగల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

5 నుంచి ఎంఈడీ పరీక్షలు..

తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోఎంఈడీ పరీక్షలు జూలై 5 వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని కంట్రోలర్ ఎం.అరుణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిర్ణీత తేదీల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్షలు కొనసాగుతాయని, పూర్తి వివరాలకు వెబ్‌సైట్ www. telanganauniversity.ac.inను సంప్రదించాలని సూచించారు.

'బ్యాక్‌లాగ్' ఫీజు చెల్లింపునకు జూలై 1 వరకు గడువు

తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో పీజీ 1, 3, 5 సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ కోర్సుల 7, 9వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షల ఫీజును జూలై 1వ తేదీ వరకు చెల్లించాలని కంట్రోలర్ ప్రొఫెసర్ ఎం.అరుణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.100 అపరాధ రుసుముతో 4వ తేదీ వరకు చెల్లించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు వెబ్‌సైట్ www. telanganauniver sity.ac.inను సంప్రందించాలని సూచించారు.

బడాపహాడ్ హుండీ ఆదాయం రూ. 21లక్షలు



వర్ని: బడాపహాడ్‌కు గత రెండు నెలల కాలంలో రూ. 20,93,790 ఆదాయం వచ్చినట్లు సూపర్‌వైజర్ జమాల్ వెల్లడించారు. సోమవారం ఉదయం నుంచి హుండీ లెక్కింపు చేపట్టగా మంగళవారం తెల్లవారుజామున లెక్కింపు పూర్తయినట్లు ఆయన పేర్కొన్నారు. ఏప్రిల్ 16వ తేదీ నుంచి 23వ తేదీ వరకు హుండీలో వచ్చిన ఆదాయాన్ని లెక్కించినట్లు తెలిపారు. వక్ఫ్ బోర్డు అసిస్టెంట్ సెక్రెటరీ అమీర్ హైమద్, ఓఎస్డీ హకీంఖాన్ ఆధ్వర్యంలో లెక్కింపు జరిగినట్లు చెప్పారు.

పదోన్నతులతో సాకారమైన కల

- పండిత్‌లకు స్కూల్ అసిస్టెంట్లుగా, పీఈటీలకు పీడీలుగా..
- పూర్తయిన బదిలీల ప్రక్రియ
- జిల్లాలో 534 మందికి లబ్ధి



పదోన్నతులు కల్పించాలని ఆందోళన చేస్తున్న భాషా పండిత్‌లు (ఫైల్)

మోర్తాడ్(బాల్కొండ): స్కూల్ అసిస్టెంట్లుగా, ఫిజికల్ డైరెక్టర్లుగా తమకు పదోన్నతులు కల్పించాలని భాషా పండితులు, పీఈటీలు ఎన్నో ఏళ్ల నుంచి డిమాండ్ చేస్తున్న ఉపాధ్యాయులు రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో తమ కల నెరవేరిందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పదో తరగతి వరకు బోధన చేస్తున్నా తమను ఎస్జీటీలుగానే కొనసాగిస్తుండటంతో తమకు అన్యాయం జరుగుతోందని తెలుగు, హిందీ, ఉర్దూ పండిత్‌లు, వ్యాయామ ఉపాధ్యాయులు గతంలో వాపోయారు. స్కూల్ అసిస్టెంట్లతో సమానంగా పని చేస్తున్నా వేతనం తక్కువ చెల్లించడం, తమ హోదాను గుర్తించకపోవడంతో భాషా పండిత్‌లు, పీఈటీలు మనోవేదనకు గురయ్యారు. తమలో ఎంతో మంది ఎస్జీటీ హోదాలోనే పదవీవిరమణ పొందాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం పట్టించుకోలేదని, ప్రస్తు కాంగ్రెస్ ప్రభుత్వం తమ ఆవేదనను అర్థం చేసుకుందని అంటున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భాషా పండిత్‌లు, వ్యాయామ ఉపాధ్యాయులకు స్కూల్ అసిస్టెంట్‌లుగా పదోన్నతి కల్పించడానికి ఆమోదం తెలుపడంతో దశాబ్ద కాలానికిపైగా నిరీక్షించిన ఉపాధ్యాయుల కల సాకారమైంది. జిల్లాలో తెలుగు పండిత్‌లు 226 మంది, హిందీ పండిత్‌లు 200, ఉర్దూ పండిత్‌లు 28 మంది, పీఈటీలు 93 మందికి పదోన్నతి లభించాల్సి ఉండగా ఇప్పటి వరకు 534 మందికి పదోన్నతి ఇచ్చారు. పదోన్నతి కల్పించడంతోపాటు బదిలీలు కూడా పూర్తి చేయడం విశేషం. పీఈటీలలో 84 మందికి పీడీలుగా పదోన్నతి కల్పించాల్సి ఉన్నా నాలుగు ఉన్నత పాఠశాలలను జాబితాలో చూపకపోవడంతో 80 మందికి పదోన్నతి ఇచ్చి బదిలీ చేశారు. మరో నలుగురికి ఈ వారంలో పదోన్నతి, బదిలీ ప్రక్రియ పూర్తి అవుతుందని ఉపాధ్యాయ వర్గాలు వెల్లడించాయి.

సీఎంకు రుణపడి ఉంటాం



ఉన్నత పాఠశాలలో పని చేసినా ఇంకా ఎస్జీటీగానే ఉన్న తమకు స్కూల్ అసిస్టెంట్‌లుగా పదోన్నతి కల్పించడంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ చూపారు. ఆయనకు భాషా పండిత్‌లు, పీఈటీలు అందరూ రుణపడి ఉంటాం.

– ప్రవీణ్ శర్మ, స్కూల్‌అసిస్టెంట్, ఏర్గట్ల

సంతోషంగా ఉంది



పదిహేను సంవత్సరాల నుంచి ఎస్జీటీగానే ఉన్న మాకు ఇప్పుడు స్కూల్ అసిస్టెంట్ హోదా లభించింది. పదోన్నతి లభించడం ఎంతో సంతోషంగా ఉంది. మాలో అనేక మంది ఎస్జీటీ హోదాలోనే ఉద్యోగం పొంది అదే విధంగా పదవీ విరమణ చేశారు.

– శ్యామ్, పీడీ, మోర్తాడ్

ఆలయాలే హిందూ ధర్మ పరిరక్షణ కేంద్రాలు

- స్వామి కమలానంద భారతి



మాట్లాడుతున్న స్వామి కమలానంద భారతి

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: దేవాలయాలే హిందూ ధర్మం, సంస్కృతీ పరిరక్షణకు శ్రద్ధ కేంద్రాలని, దేవాలయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి హిందువుపై ఉందని భువనేశ్వరి పీఠాధిపతులు కమలానంద భారతి స్వామి అన్నారు. దేవాలయాలు, దేవుడి ఆస్తులు ఆక్రమణకు గురైతే ప్రతి హిందువు తన ఇల్లు ఆక్రమణకు గురైనట్లుగా భావించి రోడ్డు మీదకు రావాలని పిలుపునిచ్చారు. అప్పుడే హిందూ జాతి అస్తిత్వం బలంగా ఉంటుందని, లేకపోతే రోజుకొకరు ఏదో ఒక రూపంలో దేవుడి ఆస్తులు, దేవాలయాలను దోచుకోవడానికి కాచుకుని కూర్చుంటారని అన్నారు. హిందూ దేవాలయ పరిరక్షణసమితి ఇందూరు శాఖ ఆధ్వర్యంలో శంభుని గుడిలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. దేవాలయాల పరిరక్షణ కోసమే రెండు తెలుగు రాష్ట్రాల్లో సంపూర్ణ గ్రామ దేవాలయ సందర్శన యాత్ర పేరుతో తాను నిర్వహించిన పాదయాత్ర, రథయాత్రలో తెలుసుకున్న విషయాలు ఎంతో ఆవేదన కలిగించాయని పేర్కొన్నారు. హిందూ సమాజం కొత్తగా దేవాలయాల్ని నిర్మించకపోయినా.. ఉన్న దేవాలయాలను పరిరక్షించుకునే బాధ్యతను మాత్రం స్వీకరించకపోతే భవిష్యత్‌లో ఎన్నో సమస్యలు వస్తాయని హెచ్చరించారు. ఇందూరులో దేవాలయాలకు ఎంతో చరిత్ర ఉందని, అంతటి మహోన్నతమైన చరిత్ర కలిగిన ఆలయాలను పరిరక్షించుకోవాల్సిన అవసరం, తక్షణ కర్తవ్యం హిందూ సమాజంపై ఉందని, అందు కోసం రాజకీయాలకు అతీతంగా ప్రతిఒక్కరూ నడుం బిగించాలని పిలుపునిచ్చారు. శంభుని గుడి చుట్టూ అక్రమంగా నెలకొల్పిన దుకాణాలను సామరస్య భావనతో తొలగించి ఆలయ పవిత్రతను కాపాడే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి, అధికారులకు ఆయన సూచించారు. శంభుని గుడితోపాటు జిల్లాలో ఆక్రమణకు గురైన దేవాలయాల ఆస్తులను తిరిగి అప్పగించాలని, ఆలయాల ఆస్తుల పరిరక్షణ కోసం శాశ్వతమైన వ్యవస్థ ఏర్పాటు చేయాలని స్వామిజీ సూచించారు. సమావేశంలో దేవాలయ పరిరక్షణ సమితి కన్వీనర్ పటేల్ ప్రసాద్, ఆలయ కమిటీ చైర్మన్ లింగం, ఈవో రవీందర్, ప్రతినిధులు జైపాల్, బంటు ప్రవీణ్, యెండల సుధాకర్, స్వామియాదవ్, శ్రీనివాస్‌శర్మ, సంజయ్ సంగ్వాయి, కిషన్, వివిధ హిందూ సంస్థల ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతుల సొమ్ము దుర్వినియోగం క్షమించరానిది

- మండల సర్వసభ్య సమావేశంలో జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు

మాక్లూర్: మాక్లూర్ వ్యవసాయ పరపతి సంఘంలో రైతుల సొమ్ము దుర్వినియోగం కావటం విచారం కల్గిస్తోందని జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు అన్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలోని సమావేశం హాల్‌లో ఎంపీపీ మాస్త ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన చివరి సర్వసభ్య సమావేశానికి దాదన్నగారి విఠల్‌రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మాక్లూర్ సొసైటీ నిధుల దుర్వినియోగ విషయం పేపర్లో చూసి తనకు బాధ కల్గిందన్నారు. జిల్లాలోనే అతిపెద్ద సొసైటీగా పేరు పొందిన మాక్లూర్ సొసైటీలో గత పాలక వర్గంలోని కొందరు గోదాములు నిర్మించకుండానే నిర్మించినట్లు చెప్పి పూర్తిగా బిల్లులు తీసుకోవటం, ఒక్క పంట సీజన్‌కుగాను సుతీళ్లు ఇతర ఖర్చుల కింద రూ.47 లక్షలు ఖర్చు చూపి డబ్బులు దుర్వినియోగం చేయటం క్షమించరానిదని అన్నారు. ఏది ఏమైనా పూర్తి స్థాయిలో విచారణ జరిపి దుర్వినియోగమైన రైతుల సొమ్మును తిరిగి రికవరీ చేయాలన్నారు. అంతకు ముందు సర్వసభ్య సమావేశంలో ఒడ్యాట్ పల్లి మాజీ సర్పంచ్ రామడోల్ల రాజేశ్వర్ మృతికి నిమిషం మౌనం పాటించి సంతాపం ప్రకటించారు. అనంతరం సమావేశాన్ని ప్రారంభించారు. గృహలక్ష్మి పథకంలో కొందరికి జీరో బిల్లులు అమలు కాలేదని ఈ విషయమై గ్రామాల్లో కొందరు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని చిన్నాపూర్ ఎంపీటీసీ సత్యనారాయణ సమావేశం దృష్టికి తెచ్చారు.రాని వారు మళ్లి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అనంతరం జెడ్పీ చైర్మన్‌ను ఎంపీటీసీలు సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో క్రాంతి, తహసీల్దార్ మహ్మద్ షబ్బీర్, వైస్ ఎంపీపీ సుక్కి సుజాత, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో చీకటి అధ్యాయం ఎమర్జెన్సీ



ఎమర్జెన్సీ సమయంలో జైలుకెళ్లిన వారితో తల్లోజు ఆచారి

సుభాష్‌నగర్: ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారతదేశంలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ విధించిన ఎమర్జెన్సీ దేశ చరిత్రలో చీకటి అధ్యాయమని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి అన్నారు. నగరంలోని బీజేపీ కార్యా లయంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి న్యాలం రాజు అధ్యక్షతన మంగళవారం ఎమర్జెన్సీ డేను నిర్వహించారు. ఎమర్జెన్సీ సమయంలో జైలుకు వెళ్లి న పుప్పాల రాజేందర్, ఉల్సే రాజేశ్వర్, పోల ఆంజనేయులు, జలగం వెంకట్‌రెడ్డి, సిలివేరి శ్రీధ ర్, బాలసాని గోవర్ధన్, ఆర్ రవినాథ్‌ను సన్మానించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆచారి మాట్లాడుతూ.. 1971 ఎన్నికల్లో ఇందిరాగాంధీ యూపీలోని రాయ్‌బరేలీ నుంచి ఎన్నికకాగా, ఆమెపై ఓడిపోయిన రాజ్‌నారాయణ హైకోర్టులో కేసు వేశారని తెలిపారు. ఇందిరాగాంధీ ఎన్నికల్లో గెలుపొందేందుకు అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని, ఆమె ఎన్నిక చెల్లదని, ఆరేళ్లపాటు ఎన్నికల్లో పోటీ చేయొద్దని 1975 జూన్ 12న హైకోర్టు తీర్పు వెలువరించిందని గుర్తు చేశారు. దీంతో దేశంలోని ప్రతి పక్ష పార్టీలు ఇందిరాను రాజీనామా చేయాలని డిమాండ్ చేయగా, తన ప్రధాని పదవి ఎక్కడ పోతుందోనని జూన్ 25, 1975 అర్ధరాత్రి ఎమర్జెన్సీ ప్రకటించిందన్నారు. అంతర్గత భద్రత కారణంగా చూపి అధికారాన్ని అంటిపెట్టుకోవాలనే ఉద్దేశంతో ఎమర్జెన్సీని ప్రకటించిందని ఆరోపించారు. 21 నెలల పాటు ఎమర్జెన్సీ కొనసాగిందని, వాజ్‌పేయీ, అద్వానీ, మొరార్జీ దేశాయ్ వంటి వారిని వారెంట్ లేకుండా అరెస్ట్ చేశారని తెలిపారు. దాదాపు రెండేళ్లు దేశాన్ని తమ గుప్పిట్లో పెట్టుకుని ప్రజల స్వేచ్ఛను ఇందిరాగాంధీ పూర్తిగా హరించారని ఆరోపించారు. ప్రజాస్వామ్య చరిత్రలో అధికారం కోసం నియంతగా మారిన ఏకైక ప్రధానమంత్రి ఇందిరా గాంధీ అని విమర్శించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నాగోళ్ల లక్ష్మీనారాయణ, దొంతుల రవి, స్వామి యాదవ్, భరత్ భూషణ్, ఇప్పకాయల కిశోర్, గడ్డం రాజు, వీరేందర్, శీల శ్రీనివాస్, గిరి బాబు, కుమార్, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె కొనసాగుతుంది



సమ్మెలో పాల్గొన్న జూనియర్ డాక్టర్లు

నిజామాబాద్‌నాగారం: జూనియర్ డాక్టర్ల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించకుంటే సమ్మె విరమించబోమని జూనియర్ డాక్టర్ల అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రకాంత్ అన్నారు. రెండో రోజు మంగళవారం కూడా నగరంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఎదుట సమ్మెలో భాగంగా నిరసన తెలుపుతున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం సమస్యల పరిష్కారానికి చర్చలు జరిపినా నిర్లక్ష్యం చేస్తుందన్నారు. న్యాయమైన డిమాండ్లు అమలు చేసేంతవరకు సమ్మె ఆపబోమన్నారు. జూడాల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేష్ నీరడి, జూనియర్ డాక్టర్లు పాల్గొన్నారు.

నగరంలో దారుణహత్య

ఖలీల్‌వాడి: నగరంలోని ఆరో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ధర్మపురిహిల్స్ రంజానీ బాబా దర్గా ప్రాంతంలో హసన్ (50) అనే వ్యక్తిని దుండగులు కత్తులతో పొడిచి, గొంతు కోసి హత్య చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. హసన్ గత 20 ఏళ్లుగా రంజానీ బాబాదర్గాలో ప్రార్థనలు చేస్తూ ఆవరణలోనే ఉన్న రేకుల షెడ్డులో ఉంటుండగా, కుటుంబ సభ్యులు వేరే ప్రాంతంలో ఉంటున్నారు. సోమవారం రాత్రి రేకుల షెడ్డులో నిద్రిస్తున్న హసన్‌ను దుండగులు కత్తులతో దాడి చేసి దారుణంగా హత్య చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. పోలీసు జాగిలాలు కొంత దూరంలో ఉన్న రేకుల ఇళ్ల వద్దకు వెళ్లి ఆగిపోయాయి. దర్గాకు వచ్చే డబ్బుల కోసం హత్య చేశారా? లేక ఇతరు కారణాలు ఏమైనా ఉన్నాయా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు నార్త్ సీఐ సురేశ్, ఎస్సై మొగులయ్య తెలిపారు.

కల్తీ కల్లు విక్రయదారుడిపై చర్యలు తీసుకోవాలి

డిచ్‌పల్లి: మండలంలోని మిట్టాపల్లిలో కల్తీ కల్లు విక్రయిస్తూ ప్రజల అనారోగ్యానికి కారణమవుతున్న మేడిద స్వామిగౌడ్‌పై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం వీడీసీ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన సుమారు 200 మంది ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్, పోలీస్ కమిషనర్, రూరల్ ఎమ్మెల్యేను కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా గ్రామపెద్దలు మాట్లాడుతూ.. కల్తీ కల్లును విక్రయించొద్దని స్వామిగౌడ్‌తోపాటు అతడి సోదరుడు శ్రీనివాస్‌గౌడ్ కోరగా.. వీడీసీ సభ్యులపైనే పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. తాము చేస్తున్న తప్పును కప్పిపుచ్చుకునేందుకు ప్రశ్నించిన వారిపైనే దౌర్జన్యానికి పాల్పడుతున్నారని అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. తాను ఆదిలాబాద్ జిల్లాలోని ఓ మండలానికి రిపోర్టర్‌గా పని చేస్తున్నానని, తాను ఏం చేసినా పోలీసులు ఏం చేయలేరని స్వామిగౌడ్ గ్రామపెద్దలను, గ్రామస్తులను బెదిరిస్తున్నట్లు ఆరోపించారు. వారిద్దరిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

క్రైం కార్నర్

రైలు కిందపడి ఆత్మహత్య



ఖలీల్‌వాడి: కుటుంబ కలహాల కారణంగా ఓ వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఆర్మూర్ పట్టణంలోని జర్నలిస్ట్ కాలనీకి చెందిన మీర్జా సాజిద్‌బేగ్(45) కుటుంబ కలహాల కారణంగా మనస్తాపానికి గురై నిజామాబాద్ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలోని మామిడిపల్లి రైల్వేగేట్ వద్ద రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

ముగ్గురి బైండోవర్



సిరికొండ: మండలానికి చెందిన ముగ్గురు సారా తయారీదారులను తహసీల్దార్ రవీందర్‌రావు ఎదుట భీమ్‌గల్ ఎక్సైజ్ పోలీసులు మంగళవారం బైండోవర్ చేశారు. ఎక్సైజ్ సీఐ వేణుమాధవ్‌రావు ఆధ్వర్యంలో ముషీర్‌నగర్‌కు చెందిన బట్టు శ్యామల, పిపావత్ మేని, నడ్మితండాకు చెందిన కేతావత్ నర్సిలను బైండోవర్ చేశారు. కానిస్టేబుళ్లు దత్తాద్రి, సుధీర్ పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో డీఎస్పీ శ్రీనివాస్, సీఐ రవీందర్ ఆధ్వర్యంలో పోలీసులు సోమవారం రాత్రి స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. డివిజన్‌లోని ఆయా పోలీస్ స్టేషన్‌ల ఎస్సైలు, సిబ్బంది ఎల్లారెడ్డి – కామారెడ్డి రోడ్డుపై వాహనాలను తనిఖీ చేశారు. నంబర్ ప్లేట్ లేని 25 వాహనాలు సీజ్ చేయడంతోపాటు మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 13 మందిపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. మద్యం సేవించి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేయడంతోపాటు లైసెన్స్ రద్దు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు. అలాగే వాహనాలకు తప్పనిసరిగా ధ్రువపత్రాలు ఉండాలని, లేనిపక్షంలో వాటిని సీజ్ చేసి చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. లింగంపేట ఎస్సై చైతన్యకుమార్‌రెడ్డి, ఎల్లారెడ్డి, గాంధారి, నాగిరెడ్డిపేట, సదాశివనగర్, తాడ్వాయి ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

భిక్కనూరులో 30 వాహనాలు సీజ్

భిక్కనూరు: మండల కేంద్రం సమీపంలోని జాతీయ రహదారిపై సీఐ సంపత్ ఆధ్వర్యంలో భిక్కనూరు, దోమకొండ, బీబీపేట ఎస్సైలతో పాటు 30 మంది సిబ్బంది వాహనాలను తనిఖీ చేశారు. నంబర్ ప్లేట్లు లేని 30 వాహనాలను సీజు చేయడంతోపాటు మద్యం సేవించి వాహనాలు నడిపిన ఐదుగురిపై కేసులు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

మోపాల్‌లో మూడు..

మోపాల్: నంబర్ ప్లేట్లు లేని మూడు ద్విచక్రవాహనాలను సీజ్ చేసినట్లు ఎస్‌హెచ్‌వో గంగాధర్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహనదారులు తప్పకుండా తమ వెంట ధ్రువపత్రాలు ఉంచాలని, లేని పక్షంలో వాహనాలను సీజ్‌చేస్తామన్నారు.

డిచ్‌పల్లి చెరువులో పడి ఒకరి మృతి



దత్తాద్రి (ఫైల్)

డిచ్‌పల్లి: మండలంలోని డిచ్‌పల్లి ఖిల్లా గ్రామానికి చెందిన మారుపాక దత్తాద్రి (61) ప్రమాదవశాత్తు చెరువులోపడి మృతి చెందినట్లు ఎస్సై యూ మహేశ్ మంగళవారం తెలిపారు. చేపలను వేటాడేందుకు సోమవారం మధ్యాహ్నం ఇంట్లో నుంచి బయటికి వెళ్లిన దత్తాద్రి తిరిగిరాకపోవడంతో కుటుంబ సభ్యు లు పలు చోట్ల వెతికారన్నారు. అయితే, మంగళవారం మధ్యాహ్నం చెరువులో దత్తాద్రి మృతదేహం కనిపించడంతో తమకు సమాచారం అందించారని తెలిపారు. ఘటనాస్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించామని, మృతుడి వీపుపై గాయాలు కనిపించడంతో బాధిత కుటుంబ సభ్యులు అనుమానాలు వ్యక్తం చేశారని ఎస్సై తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన ప్రైవేట్ బస్సు

- ఒకరి మృతి.. 28 మందికి గాయాలు



గాయాలపాలైన ప్రయాణికుడు



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన బస్సు ముందుభాగం



మృతుడు అఫ్సర్(ఫైల్)

కామారెడ్డి క్రైం: కామారెడ్డి జిల్లా కేంద్రం సమీపంలోని జాతీయ రహదారిపై మంగళవారం తెల్లవారు జామున రోడ్డుపై ఆగి ఉన్న లారీని ప్రైవేటు బస్సు వెనుక నుంచి ఢీకొట్టిన ఘటనలో ఒకరు మృతి చెందగా, 28 మంది ప్రయాణికులకు గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి.. ఆదిలాబాద్‌కు చెందిన ప్రైవేటు ట్రావెల్స్ బస్సు 34 మంది ప్రయాణికులతో సోమవారం రాత్రి 10 గంటల ప్రాంతంలో హైదరాబాద్‌కు బయలుదేరింది. మంగళవారం తెల్లవారుజామున దాదాపు 3 గంటల ప్రాంతంలో కామారెడ్డి సమీపంలోకి రాగానే క్యాసంపల్లి శివారులో జాతీయ రహదారిపై నిలిపి ఉంచిన లారీని వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సులో ఉన్న ఆదిలాబాద్‌లోని అంబేద్కర్‌నగర్ కాలనీకి చెందిన అఫ్సర్‌ఖాన్ (25) మృతి చెందగా, మరో 28 మందికి గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో రూరల్ పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని క్షతగాత్రులను జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. బస్సు డ్రైవర్ షేక్ రఫీక్‌తోపాటు మరో ప్రయాణికుడు మోబీన్‌కు తీవ్ర గాయాలుకాగా వైద్యులు నిజామాబాద్‌కు రిఫర్ చేశారు. గాయాలపాలైన వారంతా ఆదిలాబాద్, నిర్మల్ ప్రాంతాలకు చెందిన వారే. అఫ్సర్‌ఖాన్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని దేవునిపల్లి ఎస్సై రాజు తెలిపారు.

కారు ఢీకొట్టిన ఘటనలో వృద్ధుడు..



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని ఎర్రాపహాడ్ శివారులోని కామారెడ్డి – ఎల్లారెడ్డి ప్రధాన రహదారిపై మంగళవారం కారు ఢీకొట్టిన ఘటనలో కరడ్‌పల్లి గ్రామానికి చెందిన పడమటి భీమయ్య(70) మృతి చెందాడు. ఎర్రాపహాడ్ శివారులో ఈతనాడులు కోస్తున్న భీమయ్యను వేగంగా దూసుకువచ్చిన కారు ఢీకొట్టింది. తీవ్రగాయాలపాలైన భీమయ్యను కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి, వైద్యుల సూచన మేరకు అక్కడి నుంచి నిజామాబాద్‌కు తరలించగా, చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన కారులో ముగ్గురు యువకులు ఉన్నట్లు స్థానికులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు



ఘటనాస్థలంలో మనోహర్

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని కామారెడ్డి–ఎల్లారెడ్డి రహదారిపై సోమవారం రాత్రి పశువులు అడ్డు రావడంతో ద్విచక్ర వాహనం అదుపు తప్పి ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనలో స్థానికుడు ఆవుల మనోహర్ గాయపడ్డాడు. ఆయనను కామారెడ్డి ఆస్పత్రికి తరలించారు. అలాగే 4 రోజుల క్రితం రాత్రి వేళ కామారెడ్డి రోడ్డుపై పశువులు అడ్డు వచ్చి మరొకరు గాయాలపాలైనట్లు స్థానికులు తెలిపారు. పశువులు రాకపోకలకు అంతరాయం కల్గిస్తున్నాయని అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు మండిపడుతున్నారు. అధికారులు స్పందించి పశువుల యజమానులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ట్రాక్టర్ ట్రాలీ బోల్తా.. ఇద్దరికి గాయాలు



ఘటనాస్థలంలో క్షతగాత్రులు

సిరికొండ: గడ్కోల్ సమీపంలో ట్రాక్టర్ ట్రాలీ బోల్తా పడిన ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. వివరాలు .. గడ్కోల్ శివారులో రాముడు ఒర్రెపై నిర్మిస్తున్న చెక్ డ్యాం పనుల కోసం ట్రాక్టర్‌లో సామగ్రిని తరలిస్తున్నారు. గడ్కోల్ సమీపంలోకి రాగానే ట్రాక్టర్ అదుపు తప్పడంతో ట్రాలీ బోల్తా పడింది. ట్రాలీలో కూర్చున్న వారిపై సామగ్రి పడటంతో లక్ష్మీ శ్రీనివాస్‌రావు, ఏడుకొండలు అనే ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని 108లో చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రానికి తరలించారు.

స్కూటీ డిక్కీలోని రూ.2లక్షలు చోరీ



బాధితుడు సాంబయ్య

భీమ్‌గల్: స్కూటీ డిక్కీలో నుంచి రూ.2లక్షలు చోరీ అయిన ఘటన భీమ్‌గల్ పట్టణంలో మంగళవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. కమ్మర్‌పల్లి మండలం కోనసముందర్ గ్రామానికి చెందిన కొప్పెర సాంబయ్య మంగళవారం ఉదయం 11.45 గంటలకు భీమ్‌గల్‌కు వచ్చాడు. ఇంటి నిర్మాణం కోసం స్థానిక ఎస్‌బీఐ నుంచి రూ.2లక్షలు డ్రాచేసి స్కూటీ డిక్కీలో పెట్టుకున్నాడు. అనంతరం బస్టాండ్ ప్రాంతానికి వెళ్లి వాచ్ రిపేర్ చేయించుకున్నాడు. వాచ్‌ను పెట్టేందుకు స్కూటీ డిక్కీ తీయగా అందులో ఉంచి రూ.2లక్షలతోపాటు పాస్‌బుక్, ఆధార్, పాన్‌కార్డు కనిపించలేదు. బాధితుడు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బ్యాంకులోని సీసీ పుటేజీని పోలీసులు పరిశీలించి సాంబయ్యను నలుగురు వ్యక్తులు వెంబడించినట్లు గుర్తించారు. సదరు వ్యక్తులే చోరీకి పాల్పడ్డారని నిర్ధారణకు వచ్చారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

దాడి ఘటనపై విద్యుత్ అధికారుల ఫిర్యాదు

సాక్షి ఎఫెక్ట్..

నిజామాబాద్‌నాగారం: నగరంలోని టౌన్–2 పరిధిలో ఉన్న దుబ్బ సెక్షన్‌లో విధులు నిర్వర్తిస్తున్న లైన్‌మెన్‌పై కార్పొరేటర్‌తోపాటు అతడి అనుచరులు దాడి చేసిన ఘటనను జిల్లా విద్యుత్ శాఖాధికారి రవీందర్ సీరియస్‌గా తీసుకున్నారు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని డీఈ శ్రీనివాస్‌రావుతోపాటు ఏడీఈ తోట రాజశేఖర్‌ను ఆదేశించారు. సదరు లైన్‌మెన్‌తో మాట్లాడి దాడి చేసిన వారిపై సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులపై దాడి చేయడం తగదని, ప్రజాప్రతినిధులైనా, సాధరణ వ్యక్తులైనా దాడులకు పాల్పడడం సరికాదన్నారు. దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాల్సిందేనని అన్నారు.